# ఆర్థిక సంక్షోభం... జీ-20 తీర్మానాలు

**జీ-20... 1999, సెప్టెంబరు 25న ఏర్పాటైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 85 శాతం.. ప్రపంచ జనాభాలో రెండింట మూడొంతులు జీ-20 పరిధిలోకి వస్తాయి. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ లో స్థిరత్వానికి ఆయా దేశాల ఆర్థిక విధానాలపై సమీక్ష అవసరమని 1999లో జీ-7 దేశాలు భావించాయి. అందుకోసం చర్చల్లో వర్ధమాన దేశాలను కూడా కలుపుకొనిపోవాలని నిర్ధారించాయి. ఆ దిశగా తెరపైకి వచ్చిందే... జీ-20.**

## తొలి శిఖరాగ్ర సదస్సు:

జీ-20 తొలి శిఖరాగ్ర సదస్సు నవంబరు 15, 2008న వాషింగ్టన్ లో జరిగింది. అంతకుముందు జరిగిన సదస్సులన్నీ ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్ల మధ్య చర్చలకే పరిమితమయ్యేవి. వాషింగ్టన్ సదస్సుకు స్పెయిన్, నెదర్లాండ్స్‌లను కూడా ఆహ్వానించారు.

## వాషింగ్టన్ సదస్సు:

అమెరికా అప్పటి అధ్యక్షుడు జార్జిబుష్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం పరిష్కారమే వాషింగ్టన్ సదస్సు లక్ష్యమని స్పష్టం చేశారు. దాంతోపాటు భవిష్యత్‌లో ఇలాంటి సంక్షోభాలు తలెత్తకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాదులు వేయాల్సిన అవసరముందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

## భారత్... జీ-20:

జీ-20 సదస్సుకు హాజరైన భారత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మూడు ముఖ్యాంశాలను లేవనెత్తారు.

అవి... 1)అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలో సమైక్యత సాధించడం. 2) అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రగతికి ఆటంకం కలగకుండా చూడటం. 3) ఆర్థిక రక్షణ విధానాలు అనుసరించకుండా ఉండటం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమైక్యత ఎంతో అవసరమని మన్మోహన్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థలో ఒడిదొడుకులకు సంబంధించి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో.. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విఫలమవుతోందని ఆయన అన్నారు. గతంలో ఏర్పడిన జీ-7 చాలా పరిమిత వ్యవస్థన్నారు. అందువల్ల మరింత విస్తృత వ్యవస్థ ఏర్పాటైతే... అది సమర్థంగా ముందస్తు హెచ్చరికలు చేయగలుగుతుందని తెలిపారు.

ఒకవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతున్నా.. అభివృద్ధి చెందిన దేశాలు సంక్షోభం బారినపడినా.. చాలా కొద్ది దేశాలు మాత్రమే అంతర్జాతీయ ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయి. వాటిల్లో భారత్, చైనా కీలకమైనవి. ఇలాంటి దేశాలు ఆర్థిక సంక్షోభాలకుగురైతే ఆర్థిక వృద్ధికి విఘాతం

కలుగుతుంది. అందువల్ల భారత్, చైనా వంటి దేశాలకు వనరులు అందుబాటులోకి తేవాల్సిన అవసరముందని.. తద్వారా అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంజిన్‌లా పనిచేస్తాయని మన్మోహన్ పేర్కొన్నారు.

ప్రపంచ దేశాలు ఆర్థిక రక్షణ విధానాలు అవలంభించడా నికి ప్రస్తుత సంక్షోభాన్ని సాకుగా చూపరాదని మన్మోహన్ అన్నారు. వస్తు సేవలు, పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహం జరగకపోతే సంక్షోభం నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకోలేదని.. ప్రగతి సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

## డిక్లరేషన్ :

- తక్షణమే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విశ్వాసం నెలకొల్పడం.
- వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థ నియంత్రణ సాధించడం; విత్త మార్కెట్లలో నిజాయితీని ప్రోత్సహించడం; అంతర్జాతీయంగా ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం; అంతర్జాతీయ ద్రవ్య సంస్థల్లో సంస్కరణలు తేవడం.
- ప్రపంచంలోని అతిపెద్ద ద్రవ్య సంస్థల పర్యవేక్షణకు ''కాలేజ్ ఆఫ్ సూపర్‌వైజర్స్''ను ఏర్పాటుచేయడం. మితిమీరిన రిస్క్ తీసుకోకుండా బ్యాంకులను నియంత్రించడమే ఈ ప్రతిపాద న ముఖ్య లక్ష్యం.

## సదస్సు ప్రయోజనాలు:

- జీ-20 సదస్సు సాధించిన తక్షణ ప్రయోజనం.. ప్రపంచ ఆర్థిక సంక్షోభం పరిష్కారంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ను పరిగణనలోకి తీసుకోవడం. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో సంస్కరణలు తెచ్చే విషయంలో.. భారత అభిప్రాయాలను సదస్సు ప్రకటనలో చేర్చారు.
- ప్రాబల్య సమతౌల్యం క్రమేణా వర్ధమాన దేశాలవైపు మొగ్గు తోందనడానికి జీ-20 సదస్సు నిదర్శనమని ప్రధాని మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు.. అభివృద్ధి చెందుతోన్న దేశాల మధ్య మొట్టమొదటిసారిగా నిజమైన చర్చలు జరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## ముఖ్య సందేశాలు....

మన్మోహన్ సింగ్ జీ-20 ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. సదస్సు ఏడు ముఖ్య సందేశాలిచ్చిందన్నారు. అవి..

- ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో అంతర్జాతీయ స్థాయి స్పందన అవసరమని జీ-20 దేశాలు గుర్తించడం.
- ఆర్థిక వ్యవస్థలో బలహీనతలను అధిగమించేందుకు వ్యవస్థలో ద్రవ్యసరఫరా పెంచడంతోపాటు ద్రవ్య ఉద్దీపన చర్యల సమన్వయం ఎంతో అవసరమని భావించడం.
- అభివృద్ధి చెందుతున్న దేశాలకు వనరుల పంపిణీ అవసరాన్ని గమనించడం. ఆ దిశగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులకు సరిపడ అదనపు వనరులు, బాధ్యతలు అప్పగించడం.
- విత్త వ్యవస్థలో నియంత్రణ చర్యలను ప్రవేశపెట్టాల్సిన అంశాన్ని గుర్తించడం.

- స్థూల ఆర్థిక వ్యవస్థ.. ఆ వ్యవస్థలో వస్తున్న మార్పులను అన్ని కోణాలనుంచి పరిశీలించే విధానాన్ని మరింత మెరుగుపరచా ల్సిన అవసరాన్ని గుర్తించడం.
- ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కోవడానికి రక్షణ విధానాలు అవలంభించడం పరిష్కారం కాదని గుర్తించడం. ఈ దిశగా డబ్ల్యూటీఓ దోహా సదస్సు అజెండాపై త్వరగా ఒక నిర్ణయానికి వచ్చి ఒక సమతౌల్య ఫలితాన్ని సాధించాలని భావించడం.
- అధిక స్పెక్యులేషన్ వాణిజ్యానికి హానికరం అని గ్రహించడం.

## జీ 20.. లండన్ సదస్సు (ఏప్రిల్ 02–03, 2009):

**సదస్సు ప్రకటన:**

- ప్రపంచ ఆర్థిక ప్రగతిని మెరుగుపరచడానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)తో పాటు ఇతర సంస్థలకు 1.1 ట్రిలియన్ డాలర్ల సహాయం అందించాలని సదస్సుకు హాజరైన దేశాలు అంగీకరించాయి. ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోడానికి వివిధ దేశాలు సొంతగా ప్రక టించిన సహాయ ప్యాకేజీలకు ఇది అదనం. దీంతో ఈ సహాయ మొత్తం 2010 సంవత్సరం చివరకు 5 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది.
- ప్రస్తుతం ఐఎంఎఫ్ వద్ద ఉన్న నిధులను 750 బిలియన్ డాలర్లకు చేరుకునే విధంగా వనరులను మూడురెట్లు పెంచడానికి, 250 బిలియన్ డాలర్ల మేరకు కేటాయించడానికి వీలు కల్పించిన కొత్త ప్రత్యేక స్వీకరణ హక్కుల (ఎస్‌డీఆర్)కు సదస్సు మద్దతు ప్రకటించింది.
- జీ 20 సభ్యదేశాలన్నింటి ప్రాతినిధ్యంతో కూడిన ఒక కొత్త 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ బోర్డ్'(ఎఫ్ఎస్‌బీ)ని ఏర్పాటు చేయడా నికి అంగీకారం కుదిరింది.
- ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలో సంస్కరణలను చేపట్టడానికి సదస్సుకు హాజరైన నాయకుల మధ్య మొదటిసారి అంగీకారం కుదిరింది. దీని ప్రకారం బ్యాకింగ్ వ్యవస్థను ఒక రెగ్యులేటరీ పరిధిలోకి తేవడంతోపాటు అకౌంటింగ్‌కు సంబంధించి కొత్త నియమాలను అమలుచేస్తారు.
- ఆర్థిక వ్యవస్థను బలహీనపరచే ఉదార పన్ను రాయితీలు, బ్యాంకింగ్ రహస్యాల పేరిట పారదర్శక విధానాలకు తిలోదకాలు ఇవ్వడం వంటి చర్యలు ఇక సాగవని.. బ్యాంకింగ్ రంగంలో రహస్యాలకు ఇక కాలం చెల్లిందని సదస్సు ప్రకటించింది. ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన ఆంక్షలు విధిస్తామని సదస్సు హెచ్చరించింది. సమాచార మార్పిడికి సంబంధించి అంతర్జాతీయ నియమాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దేశాల జాబితాను అంతర్జాతీయ ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ) వెలువరించింది. దీని ప్రకారం ఆయా దేశాలపై చర్యలు తీసుకుంటామని సదస్సు హెచ్చరించింది.
- వివిధ దేశాలు రక్షిత విధానాల అమలును వేగవంతం చేస్తున్న నేపథ్యంలో అటువంటి చర్యలకు పాల్పడకుండా.. 2008, వాషింగ్టన్ సదస్సు తీర్మానం మేరకు వస్తు సామాగ్రి, సర్వీసులపై

పెట్టుబడులకు కొత్తగా అడ్డంకులు కల్పించకూడదని తీర్మానించింది. ఈ విధానాలు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకు విరుద్ధమని సదస్సు అభిప్రాయ పడింది.

- దోహాలో ముగిసిన డబ్ల్యూటీవో వాణిజ్య చర్చలకు లక్ష్యాత్మక మైన, సమతౌల్య ముగింపునివ్వాలని ఈ సదస్సు పిలుపినిచ్చింది. దోహా చర్చల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏటా 150 బిలియన్ డాలర్ల మేరకు బలోపేతమవుతుంది.
- అల్పాభివృద్ధి దేశాలు ఈ సహస్రాబ్దికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే విధంగా వాటికి తగిన సహాయం అందించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి పునాది వేయాలని సదస్సు నిర్ణయించింది.
- ఆర్థికవ్యవస్థ ఉద్దీపనకు అందించే ప్యాకేజీలు ఆ దేశాల పర్యావరణ వ్యవస్థకు దోహదం చేసేవిధంగా ఉండాలి.

**భారత్ పాత్ర:**

- పారిశ్రామిక దేశాలు తాము తయారు చేసిన వస్తువులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ విదేశీ వస్తువులకు సముచిత స్థానం కల్పించకపోవటం (ప్రొటెక్షనిజం) పట్ల ప్రధాని మన్మోహన్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల వల్లే 1930 ఆర్థిక మాంద్యం చాలాకాలం కొనసాగిందని ఆయన అన్నారు. నవంబర్ 2008, వాషింగ్టన్ సదస్సు అంచనాలకు మించి ఆర్థిక వ్యవస్థ పతనం ఉందని దీన్ని అధిగమించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడం కోసం పారి శ్రామిక దేశాల్లోని బ్యాకింగ్ వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.
- ఐఎంఎఫ్ కోటా నిధులను రెట్టింపు చేయాలని సూచించారు. ఈ కోటాలపై 2013లో జరపతలపెట్టిన సమీక్షా సమావేశాన్ని ఇంకా ముందే జరపాలని ఆయన కోరారు. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ ద్వారా తాజాగా 250 బిలియన్ డాలర్లు కేటాయింపులు చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ కేటాయింపుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు 80 బిలియన్ డాలర్ల విలువైన వనరులు అందుతాయని అన్నారు.
- ఆర్థిక సంక్షోభం తిరిగి పునరావృతం కాకుండా కఠిన నిబంధనలతోపాటు మెరుగైన పర్యవేక్షణ అవసరమని మన్మోహన్ సూచించారు. బ్యాంకింగేతర రంగాన్ని, పెట్టుబడి అవసరాలను పునర్నిర్వచించే క్రమాన్ని, ప్రధాన సంస్థలు తమ ఇష్టానుసారం వ్యవహరించే అవకాశం ఇవ్వకూడదు. దీనికోసం కొందరు పర్యవేక్షకుల(కాలేజ్ ఆఫ్ సూపర్‌వైజర్స్) నిత్య పర్యవేక్షణలో ఉండేటట్లు చేయడాన్ని ఆర్థికనిబంధనల పరిధిలోకి తీసుకురావాలి.

**సదస్సు ప్రాధాన్యం:**

- ప్రపంచ ఆర్థిక సంక్షోభ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సదస్సు ప్రత్యేక దృష్టి నిలిపింది. అభివృద్ధి

చె ందుతున్న దేశాలకు సహాయాన్ని పెంచాలని నిర్ణయించింది. వివిధ దేశాలు పరస్పరం సహకరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించి ఆ దిశగా గట్టి చ ర్యలు తీసుకోవాలన్న సందేశాన్ని సదస్సు అందించగలిగిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి సంస్థలకు 1.1 ట్రిలియన్ డాలర్ల అదనపు సహాయం ఇవ్వడం సదస్సు తీసుకున్న అత్యంత ప్రధాన నిర్ణయమని విశ్లేషకుల అభిప్రాయం. అంతేకాకుండా సంక్షోభం వల్ల అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థలను పునరుద్ధరించడానికి ఐఎంఎఫ్‌కు అదనంగా మరో 500 బిలియన్ డాలర్ల సహాయంతోపాటు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు ఇతర ఏజెన్సీల ద్వారా నిధులను అందజేసి చేయూతనిస్తారు.
- నియంత్రణ పరిధిలోకి బ్యాంకింగ్ వ్యవస్థతో పాటు 'షాడో బ్యాంకింగ్ వ్యవస్థ'ను కూడా తీసుకురావాలన్న నిర్ణయం చాలా కీలకమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. బ్యాంకింగ్‌కు అతి దగ్గరగా ఉండే ఈ షాడో భాగాలైన హెడ్జ్ ఫండ్స్, డెరివే టివ్ మార్కెట్లు ఇన్నాళ్లూ నియంత్రణలో లేవు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించగలిగే శక్తి వీటికి ఉంది.
- ఆర్థిక వృద్ధిని తిరిగి గాడిలో పెట్టేందుకు వివిధ రంగాలకు చెందిన సంస్థలకు నిధులను అందజేయడంతోపాటు వడ్డీ రేట్లలో భారీ కోత వంటి చర్యలు చరిత్రాత్మకమైనవని బ్రిటన్ ప్రధాని బ్రౌన్ వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవస్థను తిరిగి పునరుద్ధించడానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఒక పటిష్ట ఒప్పందం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తం మీద సదస్సు తీసుకున్న చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సమష్టిగా చేసిన కృషికి అద్దం పట్టాయి.

**లోటుపాట్లు :**

అంతర్జాతీయ రిజర్వ్ కరెన్సీగా యూఎస్ డాలర్ పాత్ర, ప్రపంచ అసమతౌల్యతకు, డాలర్‌కు ఉన్న సంబంధం వంటి అంశాలపై సదస్సు మౌనం వహించడం విమర్శలకు తావిచ్చింది. ఆర్థిక సంక్షోభాలు పునరావృతం కాకుండా నివారించగల ఈ అంశాలపై చర్చలేకపోవడం సదస్సు బలహీనతను బయటపెట్టింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని నివారించే ముఖ్య చర్యలైన అంతర్జాతీయ రిజర్వ్ కరెన్సీగా యూఎస్ డాలర్ ఉండడం, డాలర్‌తో సంబంధం ఉన్న దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి సంబంధించి ఈ సమావేశంలో ఎటువంటి చర్చ జరగలేదు.

## భారత్ ప్రయోజనాలు

- రెండు ప్రధాన స్థాయీ సూచీ సంఘాలైన ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఫోరమ్, బేసల్ కమిటీ ఆన్ సూపర్ విజన్‌లలో భారత్ సభ్యత్వం పొందింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఉత్పన్నమయ్యే సంక్షోభ పరిస్థితులను ముందుగా పసిగట్టడం ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఫోరం పని. కాగా, బ్యాకింగ్ రంగంపై పర్యవేక్షణతోపాటు పెట్టుబడుల లభ్యత, పర్యవేక్షక సమీక్ష, మార్కెట్ క్రమశిక్షణలకు సంబంధించి స్థాయీ ప్రమాణాలను నిర్ణయించడం బేసల్ కమిటీ విధి.

- భారత్‌కు ఒనగూరిన కీలక ప్రయోజనం.. రక్షిత విధానాన్ని అవలంభించకూడదని జీ 20 దేశాలు నిర్ణయించడం. ఇందువల్ల వాణిజ్యం, పెట్టుబడుల విషయంలో ఎదురవుతున్న అడ్డంకులు తొలగి, ఎగుమతులు వృద్ధి చెంది జూన్ 2009 నాటికి భారత్ తిరిగి పూర్వ దశ అందుకుంటుందని 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎక్స్‌పోర్ట్స్ ఆర్గనైజేషన్' (ఎఫ్ఐఈఓ) అభిప్రాయపడింది.
- సదస్సులో ప్రధాని మన్మోహన్ ద్వైపాక్షిక అంశాలపై వివిధ దేశాధినేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. వారిలో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబమా, బ్రిటన్ ప్రధాని గోర్డాన్ బ్రౌన్, చైనా అధ్యక్షుడు హూజింటావో, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వదేవ్ జపాన్ ప్రధాని టారో అసో ఉన్నారు.

## జీ-20 సభ్యదేశాలు:

అమెరికా, ఈయూ, చైనా, కెనడా, ఇండియా, జపాన్, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, రష్యా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, సౌదీ అరేబియా, టర్కీ, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా.

### సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ఎ | 2 | బి | 3 | సి | 4 | డి | 5 | సి |
| 6 | బి | 7 | ఎ | 8 | బి | 9 | డి | 10 | డి |
| 11 | బి | 12 | ఎ | 13 | సి | 14 | బి | 15 | సి |
| 16 | డి | 17 | సి | 18 | ఎ | 19 | సి | 20 | ఎ |
| 21 | ఎ | 22 | బి | 23 | ఎ | 24 | బి | 25 | ఎ |
| 26 | డి | 27 | బి | 28 | సి | 29 | డి | 30 | బి |
| 31 | ఎ | 32 | సి | 33 | డి | 34 | సి | 35 | ఎ |
| 36 | డి | 37 | సి | 38 | డి | 39 | బి | 40 | సి |
| 41 | బి | 42 | డి | 43 | ఎ | 44 | డి | 45 | ఎ |
| 46 | బి | 47 | సి | 48 | సి | 49 | డి | 50 | బి |
| 51 | ఎ | 52 | సి | 53 | సి | 54 | డి | 55 | సి |
| 56 | బి | 57 | డి | 58 | సి | 59 | ఎ | 60 | సి |